క్లుప్తంగా

చెరువు మట్టి తరలింపు



అంక్షాపూర్‌లోని నబీ చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతి లేకుండా చెరువు మట్టిని అమ్ముకుంటూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని రోజులుగా మట్టిని తరలిస్తున్నా ఇరిగేషన్, గ్రామ ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంక్షాపూర్‌లోని నబీ చెరువు, మగ్దుంపూర్ ఊర చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఐంక మట్టికి మంచి డిమాండ్ ఉండటంతో ట్రిప్పుకు రూ.2 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. రోజూ మట్టిని తవ్వి తరలిస్తుండటంతో చెరువుల్లో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేని కలిసిన బీఆర్ఎస్ నేతలు



హరీశ్‌రావుతో తుక్కాపూర్ నాయకులు

తొగుట(దుబ్బాక): ఎమ్మెల్యే హరీశ్‌రావును తొగుట మండలం తుక్కాపూర్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామ సమస్యలను ఆయన వివరించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారన్నారు. ఎమ్మెల్యేని కలిసినవారిలో నాయకులు చిక్కుడు రమేష్, బోయిని బాల్‌రాజు, స్వామి, రవి,ప్రశాంత్, దయాకర్, కరుణాకర్, కుమార్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి


బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతాలు



పోతిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న పర్వతాలు

చేర్యాల(సిద్దిపేట): వరంగల్, ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు ఓటర్లను కోరారు. బుధవారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోట్ల బాలరాజు, దివ్యాంగుల సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు బట్టు మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గర్నపల్లి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 27వ తేదీన జరిగే వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకి మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టణ కాంగ్రెస్ నాయకులు ఓటర్లను కోరారు. బుధవారం పట్టణంలో ఎన్నికల కరప త్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిరంజీవులు, కౌన్సిలర్ నరేందర్ పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటువేసి..

మద్దూరు(హుస్నాబాద్): వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తీన్మార్ మల్లన్న విజయం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. మల్లన్నకు మద్దతుగా బుధవారం మద్దూరు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఓటువేసి మల్లన్నను గెలిపించాలన్నారు.

పనులు పూర్తి చేయాలి

గజ్వేల్‌రూరల్: పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి, మరమ్మతులను త్వరగా పూర్తిచేయాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా బుధవారం సంగుపల్లి, సంగాపూర్, లింగరాజ్‌పేటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పాఠశాలల ప్రారంభం కంటే ముందే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ జాతర

- కాకతీయులు నిర్మించిన అమ్మవారి దేవాలయం
- తెలంగాణలోనే అతి పెద్ద విగ్రహం
- వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక
- నెలపాటు జాతర మహోత్సవాలు



హుస్నాబాద్‌లో అతిపెద్ద ఎల్లమ్మ దేవత విగ్రహం

హుస్నాబాద్: తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహం హుస్నాబాద్‌లో ఉంది. గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీరేణుకా ఎల్లమ్మ. ఎల్లమ్మ అంటే ఎల్లరకు (అందరికి) అమ్మ అని రేణుకా ఎల్లమ్మగా భక్తులచే పూజలందుకుంటుంది. శ్రీ క్రోధి నామ సంవత్సర వైశాఖ పౌర్ణమి నుంచి జేష్ఠ్య పౌర్ణమి వరకు అంటే మే 23 నుంచి జూన్ 22 వరకు రేణుకా ఎల్లమ్మ జాతర జరుగుతుంది. ఈ మాసం రైతులు పండించిన ధాన్యరాశులతో విరాజిల్లుతుంది. కాకతీయుల కాలంలో రాణీ రుద్రమదేవి పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతుంది. ఇక్కడ నిర్మించిన చెరువును ఎల్లమ్మ చెరువుగా పిలుస్తారు.

అష్టాదశ పీఠాలలోని దేవతగా..

శ్రీ రేణుకా ఎల్లమ్మను అష్టాదశ పీఠాలలోని మహూర్యే ఏకవీరికగా, సప్త మాతృకలలో ఒక దేవతగా ఇతర రాష్ట్రాలలో వివిధ పేర్లతో పూజిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో రేణుకా ఎల్లమ్మగా ప్రసిద్ధి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన దేవాలయంగా హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవాలయం పేరు గాంచింది. అమ్మవారిని బమ్మెర పోతన్న, సర్వాయి పాపన్న లాంటి ఎందరో మహనీయులు దర్శించారని స్థానికులు చెబుతారు.

అమ్మవారికి మొక్కులు

ఎల్లమ్మ జాతరకు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు వస్తారు. హుస్నాబాద్ పరిసర గ్రామాల ప్రజలు ఎల్లమ్మ పౌర్ణమిని కాలానికి ప్రామాణికంగా కొలుస్తుంటారు. ఎల్లమ్మ పౌర్ణమికి మొక్కులు తీర్చుకునేందుకు ఏ ప్రాంతంలో ఉన్నా ఈ జాతరకు వచ్చి అమ్మవారికి ఒడి బియ్యం, బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ముఖ్యంగా మహిళా కళాకారులకు ఎల్లమ్మ దేవత అంటే అమిత భక్తి. జాతరలో తలపై పెద్ద పెద్ద బోనాలు పెట్టుకొని ప్రదర్శనలు ఇస్తారు.

విశేష పూజలు

శ్రీ క్రోధి నామ సంవత్సరం వైశాఖ పౌర్ణమి 23వ తేదీన వైశాఖ ఘటంతో ఆలయ ప్రవేశం ఉంటుంది. గణపతి పూజ, పుణ్యాహవాచనం, దృష్టి కుంభం, శ్రీ రేణుకా ఎల్లమ్మ జమదగ్ని మునిరాజుల కల్యాణం (సిద్దోగం) జరుగుతుంది. ప్రతీ ఆది, మంగళ, శుక్రవారాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. ప్రతీరోజూ కుంకుమార్చన, ఒడి బియ్యం, బోనాలు సమర్పిస్తారు. పట్నాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుంది.

అన్ని రకాలకు బోనస్ ఇవ్వాల్సిందే

- బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత



మిరుదొడ్డిలో బీఆర్ఎస్ నాయకుల నిరసన ర్యాలీ

మిరుదొడ్డి(దుబ్బాక): అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణలో రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దొడ్డు, సన్న రకాల వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, మిరుదొడ్డి మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి బుధవారం నిరసన ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్ గోవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఏఎంసీ మాజీ అధ్యక్షులు వల్లాల సత్యనారాయణ, నంట బాపురెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేశం, మాజీ సర్పంచ్‌లు రాములు, సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు ధార స్వామి, గొట్టం భైరయ్య, కుమార్, మల్లయ్య, భూమరాజయ్య, బాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కేవలం సన్నవడ్లకే ..

గజ్వేల్‌రూరల్: కేవలం సన్నవడ్లకే బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర మంత్రివర్గం తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న వడ్లకే చెల్లిస్తామని ప్రకటించడం సరికాదన్నారు. బోనస్‌పై నిర్ణయాన్ని పునఃసమీక్షించి అన్ని రకాల వడ్లకు చెల్లించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

గజ్వేల్‌రూరల్: విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ(ఆపరేషన్) మోహన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సిద్దిపేట సర్కిల్ పరిధిలోని తునికిబొల్లారం, వంటిమామిడి, ములుగు, గౌరారం, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, కొడకండ్లలోగల 33/11కేవీ సబ్‌స్టేషన్లను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి, వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. సబ్‌స్టేషన్లలో సమస్యలున్నట్లయితే వెంటనే గుర్తించి వాటిని మరమ్మతు చేసి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఆయన వెంట డీఈ భానుప్రకాష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): 33 కేవీ దూళ్మిట్ట ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు దూళ్మిట్ట, బెక్కల్, భైరాన్‌పల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

గురువన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి గ్రామాలలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మధు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు , రైతులు సహకరించాలని కోరారు.

భగీరథ వాటర్ బెడ్ పరిసరాలలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున గురువారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, మిషన్ భగీరథ వాటర్ బెడ్ పరిసరాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్) సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కవి, రచయిత, ఉపాధ్యాయుడు తైదాల అంజయ్య బుధవారం అన్నారు. మండలంలోని తంగళ్లపల్లి ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చుక్క ఎల్లయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం నుంచి పుస్తక పఠనం వైపు మళ్లించడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయాలు ఆధునిక వైజ్ఞానిక దేవాలయాలన్నారు. కార్యక్రమంలో తడిసిన రాజశేకర్‌రెడ్డి, సంతోష పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీల కార్మికుల సమావేశం బ్రాహ్మణపల్లి పర్వరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాంసాగర్, అయినాపూర్, గౌరయపల్లి, పోసాన్‌పల్లి, కొమురవెల్లి, తపాస్‌పల్లి, మర్రిముచ్చాల, కిష్టంపేట గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గజ్వేల్‌రూరల్: పట్టపగలు తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన ఆదిత్య కుటుంబీకులు బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి పనిపై బయటకు వెళ్ళారు. తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండగా, బీరువాలో ఉన్న 9 తులాల బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు



ప్రచారం చేస్తున్న రవిబాబు

చేర్యాల(సిద్దిపేట): వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రొల్ల రవిబాబు ఓటర్లను కోరారు. బుధవారం ఎమ్మెల్సీ అభ్యర్థి దుర్గాప్రసాద్‌కి మద్దతుగా పట్టణ కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును పార్టీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్‌కి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో రాష్ట్రనాయకులు ప్రసన్న, మంద జ్యోతి, జిల్లా నాయకులు రాజు, నాయకుడు మెర్గోజు రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఈసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు

నంగునూరు(సిద్దిపేట): ఈసెట్‌లో రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తమ కళాశాలలో ఈసీఈ విభాగంలో తొమ్మిది మంది 200లోపు ర్యాంకులు, సీఎస్ఈ విభాగంలో 16 మంది విద్యార్థులు 500 లోపు ర్యాంకులు సాధించారన్నారు.

◆ నేడు ఇసుక వేలం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల పరిధి జాలపల్లి గ్రామంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్, పోలీసులు సీజ్ చేసిన 25 ట్రాక్టర్ల ఇసుకను గురువారం వేలం వేయనున్నట్లు దూళ్మిట్ట మండల తహసీల్దార్ శ్యామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఇసుక వేలం పాట ప్రారంభమవుతుందని, ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

◆ జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 2024 జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనె అశోక్ బుధవారం డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్ సభలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన యువతకు స్కూటీలు ఇవ్వాలని, హామీలు అమలు చేయకుండా జాప్యం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

◆ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. బుధవారం ప్రజ్ఞాపూర్‌లో వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. త్రిపుల్ రైడింగ్ చేయొద్దన్నారు.

◆ మట్టి తరలింపు అనుమతి ఇవ్వండి

హుస్నాబాద్‌రూరల్: చెరువు మట్టిని పొలాలకు తరలించడానికి రెవెన్యూ అధికారులు రైతులకు అనుమతులు ఇవ్వాలని తోటపల్లి మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కలిసి విన్నవించినట్లు చెప్పారు. సేంద్రియ ఎరువుగా ఉపయోగపడే ఒండ్రు మట్టి చెరువు నుంచి తీయడానికి అధికారులు అనుమతి ఇస్తే రైతులు తమ పొలాల్లో చల్లు కుంటారన్నారు. వానాకాలం దగ్గర పడుతుండటంతో 15 రోజులు అనుమతి ఇవ్వాలని కోరారు.

◆ పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నంగునూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రాజగోపాల్‌పేట పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నేత్రపర్వంగా శ్రీవేణుగోపాలుని ఉత్సవాలు



ధ్వజస్తంభం వద్ద గరుడ పతాకానికి పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవేణుగోపాలుని కోవెల బ్రహ్మోత్సవ శోభను సంతరించుకున్నది. గరుడ ధ్వజారోహణ మహోత్సవం నేత్రపర్వం చేసింది. సకల దేవతలకు సవాహ్నిక బ్రహ్మోత్సవ ఆహ్వానం చేరింది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రెండోరోజు గరుడ ధ్వజారోహణ వైభవంగా జరిగింది. మొదట విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుడాళ్వారు చిత్రంతో కూడిన పతాకానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద పతాకానికి రుత్వికులు షడ్రషోపచార పూజలు చేశారు. గరుడ ముద్దలు పైకి ఎగరేస్తూ నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తుల కరతాళ ధ్వనులు, మంగళవాయిద్యాల మధ్య గరుడ పతాకం ధ్వజస్తంభ శిఖరాగ్రానికి చేరింది. మరోవైపు యాగశాలలో సంప్రోక్షణ జరిపి హోమం నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు పొద్దుటూరి రాజులు, టేకులపల్లి రాంరెడ్డి దంపతులు, భక్తజనం స్వామివారి ఆశీస్సులు పొందారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి



లచ్చపేటలో భాగ్యరెడ్డి వర్మకు నివాళులర్పిస్తున్న డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్

దుబ్బాక: దేశంలో స్త్రీ విద్యను ప్రోత్సహించి, వారి కోసం మొట్టమొదటి పాఠశాలను స్థాపించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.శంకర్ అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేటలో భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది హిందూ మహాసభ పేరుతో దేశమంతా పర్యటించి మహిళలకు విద్య అవసరమని గుర్తించి విద్య, సాంస్కృతిక చైతన్యానికి నాంది పలికాడన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బంగారయ్య, ఆస యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

నిజాం రాజ్యానికి మాత్రమే..

గజ్వేల్‌రూరల్: భాగ్యరెడ్డి వర్మ చేసిన పోరాటాలు కేవలం నిజాం రాజ్యానికి మాత్రమే పరిమితం కాలేదని దళిత, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. భాగ్యరెడ్డివర్మ 136వ జయంతి సందర్భంగా గజ్వేల్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడారు. నైజాం రాష్ట్రంలో మన్నే సంఘాన్ని స్థాపించి ఇతర ఆది హిందూ జాతులను సమీకరించారన్నారు.

భగవంతుని సేవలోనే మానసిక ప్రశాంతత

రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి



ఉత్సవాల్లో పూజలు చేస్తున్న 108 జంటలు

తొగుట(దుబ్బాక): భగవంతుని సేవలోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. మండలంలోని చందాపూర్ శ్రీ ఆంజనేయస్వామి, గ్రామ దేవతల ఆలయాల వార్షికోత్సవాలు బుధవారం మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ పండగలు సాంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. ప్రజలు కులమతాలకతీతంగా కలసి మెలసి జీవించాలన్నారు. ఆంజనేయ స్వామికి ఎనిమిది లీటర్ల ఆవుపాలతో అభిషేకం, మూడు లక్షల మల్లె పూలతో అర్చన చేశారు. ఉత్సవాల్లో 108 దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

అధికారులు జవాబుదారీగా పనిచేయాలి

- ఎంపీపీ కొక్కుల కీర్తి
- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కీర్తి

కోహెడ(హుస్నాబాద్): ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీగా పనిచేయాలని ఎంపీపీ కొక్కుల కీర్తి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలం పంటల సాగుకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. అంతకు ముందు సభలో పలువురు సభ్యులు సమస్యలపై ప్రస్తావించారు. గొర్రెల మంజూరుకు 375 మంది డీడీలు చెల్లించారని, ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని పరివేదకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు బాపయ్య సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ సమస్యను పరిష్కరించాలని పశువైద్యాధికారిని ఆదేశించారు. అనంతరం విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఉందని తంగళ్లపల్లి, కూరెల్లా ఎంపీటీసీలు కోనె శేఖర్, జాగిరి కుమారస్వామి సభలో ప్రస్తావించారు. ఇటీవల చెట్ల కొమ్మలు తొలగించి పునరుద్ధరణ చేసినట్లు ఏఈ తెలిపారు. చెట్ల తొలగింపు కోసం ఎంపీడీఓ అనుమతి తీసుకోవాలని సంబంధిత విద్యుత్ ఏఈని ఆదేశించారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందేవిదంగా చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. కొన్ని పాఠశాలలకు నీటి కొరత ఉందని, సమస్యను పరిష్కరించాలని ఏంఈఓ కోరారు. పంచాయతీ కార్యదర్శులు సమస్య ఉన్న పాఠశాలలను సందర్శించి నీటి సమస్య పరిష్కరించాలన్నారు. రానున్న వానాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్లు సహకరించిన సభ్యులకు ఎంపీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ సురేఖ, ఎంపీడీఓ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు



బొమ్మలు వేసిన విద్యార్థులు

మండలంలోని వింజపల్లి గ్రామ పరిధి పెరుకలగడ్డ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం డి.రవివర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, ఇంగ్లీష్ స్పికింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు వాటిని ఉపయోగించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

–కోహెడరూరల్(హుస్నాబాద్)